

కంటికి కునుకు కరువాయే!

ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్, టెక్నాలజీ, టెలివిజన్ ప్రసారాలు సిటీజన్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 8లో▸



దళారీ వ్యవస్థ నిర్మూలిస్తాం

పశువుల సంతలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తానని తాండూరు వ్యవసాయ ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. 8లో▸



కందికి భలే డిమాండ్..!

కందుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సీజన్ ఆరంభంలోనే ప్రభుత్వ మద్దతుకు మించి ధర పలుకుతోంది. 9లో▸

పది రోజులే..

- మరో నాలుగు పథకాలకు ప్రభుత్వం శ్రీకారం
- అర్హుల ఎంపికకు క్షేత్రస్థాయి సర్వే షురూ
- ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు సంకల్పించింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు గురువారం నుంచి క్షేత్ర స్థాయి సర్వే ప్రారంభించింది.



పారదర్శకత ప్రశ్నార్థకం

గ్రామ సభలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా నిబంధనల ప్రకారం కమిటీల ఏర్పాటు జరగలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, లేదా పార్టీ ఇన్‌చార్జిల కనుసన్నల్లోనే కమిటీలు వేశారు. వారు కమిటీల్లో ఎవరి పేర్లు నామినేట్ చేసి ఇస్తే వారినే కమిటీ సభ్యులుగా అధికారులు నమోదు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 20 రెవెన్యూ మండలాలు ఉండగా 18 మండల పరిషత్‌లు ఉన్నాయి. మండల పరిషత్‌ల ఆధారంగా ప్రస్తుతం కమిటీల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు 18 మండలాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తయింది. జిల్లాలో మొత్తం 585 గ్రామ పంచాయతీలు ఉండగా వీటితో పాటు మున్సిపల్ వార్డుల్లోనూ ఇందిరమ్మ కమిటీల ప్రక్రియ పూర్తి చేశారు. కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించినప్పటికీ ఎమ్మెల్యేలు, మండల కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించిన పేర్లతోనే కమిటీలు ఏర్పాటయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఏ మేరకు ఉంటుంది.. నిజమైన పేదలకు లబ్ధి చేకూరేనా..? అనే విషయంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వికారాబాద్: మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 21 నుంచి 24వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి తుదిజాబితాకు ఆమోదం తెలపాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ ప్రతీక్‌జైన్ వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డు కమిటీల వారిగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీల సాయంతో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన దరఖాస్తుల విచారణ పూర్తి చేశారు. ఇందిరమ్మ కమిటీల్లో ఎక్కువగా కాంగ్రెస్ నేతలే ఉన్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకత ఏ మేరకు పాటిస్తారనే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 15వేల ఇళ్లు

ప్రభుత్వ రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు 4.5లక్షల ఇళ్లను నిర్మించాలని భావిస్తోంది. ఇందులో మొదటి విడతలో నియోజకవర్గానికి 3వేల నుంచి 3,500 వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 14 వేల నుంచి 15 వేల ఇళ్లు నిర్మించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

అధికారులు, ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యంతో లబ్ధిదారుల ఎంపిక

లబ్ధిదారుల ఎంపికలో అధికారులతో పాటు ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయించారు. కమిటీల్లో చైర్మన్‌గా సర్పంచ్లు, కన్వీనర్లుగా పంచాయతీ కార్యదర్శులు, ఇద్దరు స్వయం సహాయక సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్తులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ ఒక్కొకరి చొప్పున), మరో ఇద్దరు ఇతర సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం సర్పంచ్‌లు లేనందున వారి స్థానంలో ప్రత్యేక అధికారులు ఉంటారు. కాగా కమిటీల ఏర్పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.



వట్టిమీనపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- మోడల్ ఆస్పత్రిగా నవాబుపేట పీహెచ్‌సీ
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లదో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాశాఖ అధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి.. మరమ్మతు పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించామన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నవాబుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

అనంతరం మండల పరిధిలోని వట్టిమీనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పులుమామిడిలో చేపట్టిన రైతు భరోసా సర్వేను క్షేత్రస్థాయిల పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సర్వే పూర్తయిన తర్వాత గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. వట్టిమీనపల్లి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం సరఫరా చేయాలని సూచించారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, తహసీల్దార్ జైరాం, ఎంపీడీఓ అనురాధ, వ్యవసాయాధికారి జ్యోతి, మండల వైద్యాధికారి రోహిత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

స్కాలర్‌షిప్ దరఖాస్తుకు మార్చి 31 వరకు గడువు పెంపు

అనంతగిరి: అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుకు మార్చి 31 వరకు గడువు పెంచినట్లు ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి మల్లేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గమనించి తెలంగాణ ఈపాస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50లక్షలు మించొద్దన్నారు. సంబంధిత కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు తగు సూచనలిచ్చి వంద శాతం రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టర్ కార్యాలయంలోని రూం నంబర్–10లో సంప్రదించాలన్నారు.

బీఆర్‌ఓయూ అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు చివరి అవకాశం

ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 25లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించాలని కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ అడ్మిషన్ ఫీజు చెల్లించే అవకాశం ఉందని ఇప్పటి వరకు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

హౌసింగ్ శాఖకు పూర్వ వైభవం

డీఈఈ ఖలీముద్దీన్

తాండూరు రూరల్: తొమ్మిదేళ్ల తర్వాత హౌసింగ్ శాఖకు పూర్వవైభవం వచ్చిందని ఆ శాఖ డీఈఈ ఖలీముద్దీన్ అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసిన విషయం విదితమే. కాగా అధికార కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో హౌసింగ్ శాఖ డీఈఈ డీఈఈ ఖలీముద్దీన్, ఏఈ రహీమ్‌లు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖలీముద్దీన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం ఎంపీడీఓ కార్యాలయం పక్కన స్థలం ఎంపిక చేశామన్నారు. త్వరలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేత ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోరకు భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల జాబితాను తయారు చేస్తోందని తెలిపారు.

విద్యకు మొదటి ప్రాధాన్యం

మంత్రి సీతక్క

చైతన్యపురి: రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యమిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. గురువారం కొత్తపేటలోని సరూర్‌నగర్ సంక్షేమ గురుకులాల కళాశాలలో సంక్షేమ గురుకుల విద్యాలయాలు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె చెప్పారు. తోటమాలి మొక్కలను ఎలా జాగ్రత్తగా సంరక్షిస్తారో అదే రకంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పండిట్ జవహర్ లాల్ చెప్పేవారని గుర్తు చేశారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందని, ఆ భవిష్యత్ టీచర్లు, ప్రిన్సిపాల్స్ చేతుల్లో ఉంటుందన్నారు. టీచర్లు నిత్య విద్యార్థుల్లా ఉండాలని సూచించారు. తాను హాస్టల్‌లో ఉండి చదుకువున్నానని, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, పీహెచ్‌డీ చేసి ఇప్పుడు మరో పీజీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. హాస్టల్ జీవితం ఆనందదాయకంగా ఉండాలని, అందించే ఆహారం సొంత కుటుంబాన్ని గుర్తు చేసుకునేలా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కద్తాల్: అనాథ శవానికి స్థానికుల సహాయంతో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల రాఘవేందర్. మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు పల్లూడం రాములు(83), గ్రామంతో పాటు మైసిగండి గ్రామంలో యాచిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. యువజన సంఘాల ఐక్యవేదిక, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్ల వద్ద, అదనపు గదిలో నివసిస్తున్నాడు. కొంత కాలంగా రాములు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ.. బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయనకు ఎవరూ లేక పోవడంతో అంత్యక్రియలు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా పలువురు రాఘవేందర్‌ను అభినందించారు. వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, యాదయ్య, శేఖర్, అంజయ్య, జంగయ్య, శ్రీరాములు, కుమార్‌గౌడ్, సత్యనారాయణ, బాలయ్య, శివకుమార్, మహేశ్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



మల్కాపూర్ నాపరాతి గనుల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

మైనింగ్ భూములను గుర్తించండి

- సాగుకుయోగ్యం కాని భూములను గుర్తించేందుకు ఐదు ప్రత్యేక బృందాలు
- తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్: పట్టా భూముల్లో మైనింగ్, మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను గుర్తించి భూముల వివరాలను సేకరించాలని తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిధిలోని మల్కాపూర్ నాపరాతి గనుల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఓగిపూర్, కరన్‌కోట్, మల్కాపూర్, సంగెంకలాన్, కోటబాసుపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో నాపరాతి గనులున్నాయన్నారు. మైనింగ్ శాఖ నుంచి లీజుదారుల జాబితా తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సాగు యోగ్యంకాని భూములకు ఎట్టి పరిస్థితుల్లో రైతు భరోసా ఇవ్వొద్దని అన్నారు. మండల వ్యాప్తంగా ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాగు యోగ్యంకాని భూముల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఈ నెల 20వరకు సర్వే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, వ్యవసాయ శాఖ ఏఓ కొమురయ్య, ఏఈఓలు శ్రీను, శివకుమార్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మొగిలిగిద్ద వేడుకలకు సీఎం

- 150 వసంతాలు పూర్తి చేసుకున్న పాఠశాల
- ఈనెల 31న ఉత్సవాలు
- ఏర్పాట్లపై రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్: ఫరూక్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపతున్నామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. స్కూల్ ఏర్పడి 150 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ఈనెల 31న నిర్వహించే వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి స్కూల్ ఆవరణలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆర్‌డీఓ ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలో పర్యటించి అన్ని వివరాలను సేకరిస్తుందన్నారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఆరోగ్య సబ్ సెంటర్, నీటి వసతి ఏర్పాటుకు చర్యలు చేపడుతామని వెల్లడించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంతో కొనసాగుతున్న మొగిలిగిద్ద స్కూల్‌కు వెంటనే శాశ్వత హెచ్‌ఎంను నియమించాలని డీఈఓ సుశీందర్‌రావును ఆదేశించారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెంటనే అటెండర్‌ను నియమించాలన్నారు. గ్రామంలో, పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాల, గ్రామానికి సేవ చేయడంలో ఎంతో సంతృప్తి దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. మొగిలిగిద్దకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. గతంలో ఈ పాఠశాలను సందర్శించినప్పుడు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీపీఓ సురేష్ మోహన్, ఆర్డీఓ సరిత, నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయండి..

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతుభరోసా పథకం సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నందిగామ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ రాజేశ్వర్‌ను అడిగి సర్వే వివరాలను తెలుసుకున్నారు. అనర్హులకు పథకం వర్తించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వెంచర్లు, రోడ్లు, కన్వ ర్షన్ అయిన భూములు, పరిశ్రమలు, గుట్ట లు, వాగులు, వంపులను గుర్తించాలన్నారు.

వైభవంగా జేపీదర్గా గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా

- పాల్గొన్న భక్తజనం
- బాబాకు గంధం సమర్పించిన ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు చైర్మన్

కొత్తూరు: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గంధోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇన్ముల్‌నర్వ గ్రామం హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీలు బాబాకు గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... జేపీ దర్గాకు దేశ వ్యాప్తంగా ఖ్యాతి ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో బాబా దర్శనం కోసం వస్తారని తెలిపారు. గత ప్రభుత్వాలు దర్గా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దర్గా దర్శనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు, వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బస్టాండ్, తాగునీరు, వసతి, మరుగుదొడ్లతో పాటు పలు వసతులను కల్పించనున్నట్లు వివరించారు. ఉత్సవాల నేపథ్యంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, ఖాజా, ఖాలేద్, సిరాజ్, తస్లీమ్, రషీద్, షౌకత్, కృష్ణ, ఆగీరు రవికుమార్‌గుప్త, శేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలని సెంట్రల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(సీసీఆర్‌టీ న్యూ ఢిల్లీ) మాజీ డైరెక్టర్ గిరీశ్‌జోషి అన్నారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్, సీసీఆర్‌టీ, డీఆర్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో ఎర్త్ అండ్ కల్చర్ అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ విద్యా సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్.ఉపేందర్ రెడ్డితో పాటు, 16 రాష్ట్రాలకు చెందిన 60 మంది డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. అనంతరం ఎర్త్ సెంటర్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సాయిభాస్కర్ రెడ్డి, డీఆర్పీలు గన్నారం ప్రభాకర్, పంజ రాజమల్లు, వెంకటేశ్వరరావు, నాగరాజు, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న గిరిశ్ జోషి తదితరులు

ఎన్నికల వరకే రాజకీయాలు



అమృత్ 2.0 పథకం శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

- ఆతర్వాత అంతా ప్రజల కోసమే పనిచేయాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- శంకర్‌పల్లిలో రూ.32.47 కోట్లతో అమృత్ 2.0 పథకానికి శంకుస్థాపన

శంకర్‌పల్లి: 'ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అంతా ప్రజల కోసమే పని చేయాలి' అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలోని బీడీఎల్ చౌరస్తా వద్ద రూ.32.47 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 (మంచినీటి సరఫరా అభివృద్ధి) పథకానికి గురువారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రానికి కావాల్సిన అన్ని నిధులను కేంద్రం మంజూరు చేస్తోందన్నారు. శంకర్‌పల్లి వరకు ఎంఎంటీఎస్ రైళ్లు పొడిగించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుందన్నారు. రూ.30 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయివేటు వాహనాలు నియంత్రించాలని ఫిర్యాదు



సీఐ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కొడంగల్: కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రవేశిస్తున్న ప్రయివేటు వాహనాలను నియంత్రించాలని కంట్రోలర్ పట్లోళ్ల నర్సింహారెడ్డి గురువారం సీఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రయివేటు వాహనాలు రావడం వల్ల బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. డీఎమ్ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బస్టాండ్‌లో అనధికారికంగా ప్రయివేటు వాహనాలను నిలుపుతున్నారని, కొంత మంది ద్విచక్ర వాహనాలను పార్క్‌చేసి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రైవేటు వాహనాల విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలుగా పదోన్నతి



ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారితో ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో 9మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని ఎస్పీకి రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిని ఎస్పీ అభినందించారు. ఎల్లపుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

యువకుడి దుర్మరణం



సుభాష్ (ఫైల్)

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కుమ్మరికుంట తండాకు చెందిన సుభాష్(31) కూలీ. గురువారం ఆయన బీజాపూర్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ గడిసింగాపూర్‌కు వెళ్తున్నాక్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

అమీర్‌పేట: విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ గుండె పోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..బాపట్లకు చెందిన వినయ్ భాస్కర్ (53) ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో డ్యూటీకి వచ్చాడు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గుండె పోటు రావడంతో సిబ్బంది అతడిని అమీర్‌పేటలోని వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేయడంతో సాధారణ స్థితికి వచ్చాడు. ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తుండగా అర్ధరాత్రి రెండో సారి గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వినయ్ భాస్కర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్ సిబ్బందితో కలిసి బోయిన్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

కీసర: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంగూడ గ్రామానికి చెందిన ఇందిరాల మల్లారెడ్డి (24) గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటికి కునుకు కరువాయే!

అర్ధరాత్రి దాటినా ఫోన్ ఆట

- నైట్ డ్యూటీలు, ఫేస్‌బుక్, వాట్సాప్ టెక్నాలజీ ప్రభావం
- మోతాదు మించిన మద్యపానం, మాంసాహారం
- జిల్లాలో నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న 40 శాతం మంది
- రోజుకు 7,8 గంటల నిద్రతోనే ఆరోగ్యమంటున్న వైద్యులు



హుడాకాంప్లెక్స్: ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్, టెక్నాలజీ, టెలివిజన్ ప్రసారాలు సిటీజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రి 9 గంటలకే పడకెక్కాల్సిన వారు.. అర్ధరాత్రి దాటినా అరచేతిలో ఫోన్‌తో గడుపుతున్నారు. అందివచ్చిన సాంకేతిక, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు తోడు కావడంతో జిల్లాలో 40 శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. పరోక్షంగా ఇది తీవ్రమైన మానసిక ఆందోళన, ఏకాగ్రత లోపం, మధుమేహం, హైపర్ టెన్షన్లకే కాదు, యువత దాంపత్య జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఎవరు ఎన్నిగంటలు నిద్ర పోవాలి..	
రోజుల వయసు శిశువులు:	18 గంటలు
ఏడాది లోపు చిన్నారులు:	14- 18 గంటలు
ఏడాది నుంచి మూడేళ్లలోపు:	12- 15 గంటలు
3-5 ఏళ్లలోపు చిన్నారులు:	11-13 గంటలు
5- 12 ఏళ్లలోపు ఉన్న వారు:	9- 11
12- 19 ఏళ్లలోపు ఉన్న వారు:	9-10 గంటలు
21 సంవత్సరాలు పైబడిన వారు:	7- 8 గంటలు
50 ఏళ్లు పైబడిన వారు 5- 7 గంటలు	

సమస్య నుంచి మరో సమస్య..

ఒకప్పుడు రాత్రి 8 గంటలకే నిద్రకు ఉపక్రమించిన సిటీజన్లు.. ప్రస్తుతం తీవ్రమైన పని ఒత్తిడి, మానసిక ఆందోళనతో అర్ధరాత్రి దాటినా రెప్పవాల్చడం లేదు. ఐటీ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారు.. విదేశాలకు అనుగుణంగా తమ పని వేళలను మార్చుకోవడం, వీకెండ్ పార్టీల పేరుతో వీరు ఎక్కువ సేపు డిస్కోలు, పబ్‌లలో గడుపుతున్నారు. ఇదే సమయంలో అర్ధరాత్రి దాకా మద్యం తాగడం, ఆయిల్, మసాలా ఫుడ్ ఎక్కువగా ఆరగిస్తున్నారు. ఆహారం జీర్ణం కాకముందే నిద్రకు ఉపక్రమించడంతో.. శ్వాసనాళాలపై ఒత్తిడి పెరుగుతోంది. పడకెక్కిన పది నిమిషాలకే గురకపెడుతున్నారు. బాధితుల్లో కొంతమంది స్లీపింగ్ టాబ్లెట్స్, ఇతర మత్తు పదార్థాలకు, మద్యానికి అలవాటు పడుతున్నారు. ఇలా ఒక సమస్య నుంచి బయటపడేందుకు యత్నించి, మరో సమస్యలో చిక్కుకుంటున్నట్లు జాతీయ నిద్ర ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

మంచి నిద్ర కోసం చిట్కాలు



నిద్ర పోవడానికి, మేల్కొనడానికి కచ్చితమైన వేళలు పాటించాలి. నిద్రకు ముందు ఎక్కువ భోజనం చేయకూడదు. నిద్రకు 4 గంటల ముందే మద్యం తాగడం ఆపేయాలి. ఆరు గంటల ముందే కాఫీ, టీతో పాటు సోడా, చాక్లెట్ వంటి వాటిని తీసుకోవడం ఆపేయాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కానీ నిద్రపోయే ముందు మాత్రం కాదు. గదిని చల్లగా, చీకటిగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోవాలి. శరీరానికి అవసరమైన ఉష్ణోగ్రత, వెంటిలేషన్ ఉండాలి. పడక గదిలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు, తిరుమల ఆస్పత్రి, ఓంకార్‌నగర్

యువతలోనే అధికం



ప్రతి పది మందిలో ముగ్గురు నిద్రలేమితో బాధపడుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది 35 ఏళ్లల లోపు వారే. నిద్ర లేమితో జబ్బులు రాకుండా ఉండాలంటే వ్యక్తికి కనీసం 8 గంటల నిద్ర తప్పనిసరి. ఆరు, అంతకన్నా తక్కువ గంటలు నిద్రపోతే ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి సంబంధ సమస్యలు వస్తాయి. రోగ నిరోధక శక్తి బలహీన పడుతుంది. ఆయుష్షు తగ్గిపోతుంది. కేవలం నాలుగైదు గంటలు మాత్రమే నిద్రపోయే వారిలో కేన్సర్‌పై పోరాడే శక్తి 70 శాతం తక్కువ ఉంటుంది. అంతేకాదు రాత్రి నిద్ర పోకపోవడం వలన మానసిక, శారీరక ఎదుగుదలకు సంబంధించిన హార్మోన్స్ తగ్గడంతో పాటు సెక్స్‌వల్ హార్మోన్స్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది.

– డాక్టర్ అమరవాది ప్రభాకరాచారి, సీనియర్ వైద్య నిపుణులు

సుఖ నిద్ర కోసం జాగ్రత్తలు



నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్లు, ఇతరత్రా డిజిటల్ స్క్రీన్లు చూడొద్దు. అవి నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాఫీ తాగితే బాగా నిద్ర పడుతుందని చాలా మంది భావిస్తుంటారు. కానీ అది తప్పు. మెదడు చుట్టూ ప్రవహించే కెఫిన్ గాఢనిద్రను దూరం చేస్తుంది. మద్యం సాధ్యమైనంత త్వరగా స్పృహను పోగొట్టి, సహజసిద్ధమైన నిద్రను దూరం చేస్తుంది. రాత్రిపూట మధ్య మధ్యలో నిద్రలేచేలా చేస్తుంది. అలా లేచిన విషయం గుర్తుండకుండా చేస్తుంది. గాఢ నిద్రను అడ్డుకుంటుంది. కాబట్టి మద్యం నిద్రకు ఉపకరించదు. రాత్రి 7 గంటల లోపే డిన్నర్ పూర్తి చేయాలి. ఆ తర్వాత టీవీ, సెల్‌ఫోన్ ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను స్విచ్చాఫ్ చేసి, పడక గదిలోకి వెళ్లాలి. వ్యాయామం, యోగాసనాలు సుఖ నిద్రకు బాగా ఉపయోగపడతాయి. – డాక్టర్ అర్చన, మెడికల్ ఆఫీసర్, సరూర్‌నగర్

దళారీ వ్యవస్థను నిర్మూలిస్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ బాల్‌రెడ్డి

తాండూరు: పశువుల సంతలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తానని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణ శివారులోని పశువుల సంతను సందర్శించారు. ఈ సందర్భంగా సంతకు పశువులు తీసుకువచ్చిన పలువురు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంత ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించాలని.. తాగునీటి సమస్య పరిష్కరించాలని.. వేసవి నుంచి ప్రతిరోజు సంత నిర్వహించేలా చూడాలని.. గొర్రెలు, మేకల సంతను ఇదే ప్రాంగణంలో నిర్వహించాలని కోరారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంతను ఏర్పాటు చేశామని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు. మూడు నెలల్లో పశువుల సంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

విద్యాభివృద్ధికి పాటుపడటం హర్షణీయం

ప్రొఫెసర్ హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్: విద్యారంగ అభివృద్ధికి పాటుపడితే.. చిరస్థాయిగా గుర్తిండిపోతారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రొఫెసర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య పూర్తిగా వెనుకబడిందన్నారు. ప్రస్తుతం పేదవాళ్లు మాత్రమే సర్కారు బడులు, కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. సంపన్నులు, డబ్బులు ఉన్న వారు ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్తున్నారని తెలిపారు. సర్కారు బడుల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను.. దాతల సహకారంతో ఎమ్మెల్యే నిర్మిస్తుండటం హర్షణీయమన్నారు. 150 ఏళ్ల క్రితం మొగిలిగిద్దలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలో తాను విద్యను అభ్యసించానని, ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించే స్వర్ణోత్సవ వేడుకలకు వస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, విశ్వం, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, ఎండీ ఇబ్రహీం, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై..

డబ్బులు ఇవ్వలేదని నాన్నమ్మపై దాడి

కుల్కచర్ల: నానమ్మ డబ్బులు ఇవ్వలేదని మద్యానికి బానిసైన మనుమడు ఆమెను గాయపరిచిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... కుల్కచర్ల మండలం బిందెంగడ్డ గ్రామ పంచాయతీకి చెందిన కోటమ్మ(90) పెన్షన్ డబ్బులతో జీవితాన్ని గడుపుతుంది. ఆమె కుమారుడు, కోడలు మృతి చెందడంతో మనుమళ్లతో ఉంటుంది. ఈ క్రమంలో మనుమడు వడ్డ్య లక్ష్మణ్ (29)తో కలిసి గ్రామంలో జీవిస్తుంది. మద్యానికి బానిసైన మనుమడు లక్ష్మణ్ తరచూ డబ్బులు అడిగేవాడు. ఈ నెల 13న డబ్బులు ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో ఆమె తలను గోడకు కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. చుట్టుప్రక్కల వారు దీన్ని గమనించి ఆమెను 108ద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అపస్మారక స్థితిలో చికిత్స పొందుతుంది. మూడో మనుమడు హరిశ్చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోడౌన్‌లో చోరీ

మొయినాబాద్: గుర్తు తెలియని దుండగులు గోడౌన్ తాళాలు పగలగొట్టి నగదును అపహరించారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో పద్మావతి అసోసియేట్ పేరుతో స్టోరేజి గోడౌన్ ఉంది. దీనికి పెద్దమంగళారంకు చెందిన వినీత్‌రెడ్డి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నాడు. బుధవారం సాయంత్రం 5 గంటలకు గోడౌన్‌కు తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం 8 గంటలకు వచ్చి చూసే సరికి తాళాలు విరగ్గొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అందులోని రూ.5.20 లక్షల నగదు కనిపించలేదు. గోడౌన్‌లో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. రాత్రి సమయంలో ఇద్దరు దుండగులు తాళాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు ఘటనా స్థలికి వచ్చి.. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాత నేరస్తుడి పనే..

- భారీ చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- 24 గంటల్లోనే కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన పోలీసులు



దాసరి రక్షక్‌రాజ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో జరిగిన భారీ చోరీ కేసు బంజారాహిల్స్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరానగర్‌కు చెందిన లోవకుమారి, వీరవెంకటరమణ దంపతులు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 12న ఇంటికి తాళం వేసి రాజమండ్రికి వెళ్లారు. ఇంటి భద్రతను ఇంట్లో కిరాయికి ఉండే తిరుమలరెడ్డికి అప్పగించారు. అయితే సినిమా షూటింగ్‌లలో హెల్పర్‌గా పనిచేసే తిరుమలరెడ్డికి నాలుగు రోజుల క్రితం ఫేస్‌బుక్‌లో బోరబండ కార్మికనగర్‌కు చెందిన దాసరి రక్షక్‌రాజ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మూడు రోజులుగా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఈ నెల 13న రాత్రి తిరుమలరెడ్డి ఆహ్వానం మేరకు రక్షక్‌రాజ్ అతడి ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. పీకలదాకా మద్యం తాగిన తిరుమలరెడ్డి నిద్రపోయాడు. అదే అదునుగా అంతకముందే సదరు ఇంటి యజమానుల వివరాలు ఆరా తీసిన రక్షక్‌రాజ్ వారు లేరని తెలుసుకున్నాడు. బండరాయితో ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.25 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలతో తన స్కూటీపై ఉడాయించాడు. రంగంలోకి దిగిన బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా బైక్‌పై ఇద్దరు వచ్చిన దృశ్యాలు, వెళ్లేటప్పుడు ఒక్కడే వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. తిరుమలరెడ్డితో వచ్చిన వ్యక్తి ఎవరని ఆరా తీయగా తనకు మూడు రోజుల క్రితమే పరిచయం ఏర్పడిందని చెప్పాడు. దీంతో పోలీసులు రక్షక్‌రాజ్ ఫోన్ నెంబర్ ఆధారంగా గురువారం ఉదయం అతడిని కార్మికనగర్‌లోని అతడి ఇంట్లో అదుపులోకి తీసుకున్నారు. బీరువాలో దాచిన నోట్ల కట్టలు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. 2020లో జూబ్లీహిల్స్‌లో ఓ చోరీ కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లుగా గుర్తించారు. ఎనిమిది నెలల క్రితం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే చోరీకి యత్నించి పోలీసులకు చిక్కినట్లుగా విచారణలో వెల్లడైంది. కిరాయిదారు తిరుమలరెడ్డికి రక్షక్‌రాజ్ ఫేస్‌బుక్‌లో పరిచయమైనట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. చోరీ సొత్తు పూర్తిగా పట్టుబడడంతో అటు బాధితులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటయ్య తదితరులు



అనంతగిరి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిపాల్

జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25వ తేదీ నుంచి 28వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యమాల పోరాటాల సారథి, కష్టజీవుల గొంతుక సీపీఎం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేది సీపీఎం పార్టీనన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్, సత్తయ్య, యాదయ్య, రఘురాం, శేఖర్, లాలయ్య, రమేశ్ పాల్గొన్నారు.

అనంతగిరి: సంగారెడ్డిలో ఈ నెల 25నుంచి 28వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ప్రజల కోసం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నవీన్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ సురేశ్

మర్పల్లి: గ్రామదేవతల బోనాలను కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ప్రశాంతవాతారణంలో నిర్వహించుకోవాలని మోమిన్‌పేట్ సీఐ నవీన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సమయంలో ఎవరైనా ఇబ్బందులు కలిగించినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి ఎస్ఐ సురేశ్, పోలీస్ సిబ్బంది, మాజీ సర్పంచ్ రవీందర్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు మధుకర్, నారాయణరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, కిష్టప్ప, బలవంత్‌రెడ్డి, శ్రీనివాస్ గ్రామస్తులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగదు ఇస్తానని.. వృద్ధుడికి టోకరా

రూ.75వేలు బదిలీ చేయించుకుని పరారీ

మలక్‌పేట: నగదు ఇస్తానని చెప్పి గుర్తుతెలియని వ్యక్తి ఓ వ్యాపారి నుంచి రూ. 75 వేలు గూగుల్‌పేకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని పరారైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌బాగ్ డివిజన్, ఆంధ్రాకాలనీకి చెందిన తిప్పన జనార్దన్‌రెడ్డి మలక్‌పేట సూపర్‌బజార్‌లో జిరాక్స్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం యాక్టీవాపై అక్కడికి వచ్చిన గుర్తు తెలియని జనార్దన్‌రెడ్డిని మాటల్లో పెట్టాడు. అత్యవసర పరిస్థితి ఉన్నందున రూ.75 వేలు గూగుల్ పే చేయాలని, నగదు ఇస్తానని కోరాడు. అతడి మాటలు నమ్మిన జనార్దన్‌రెడ్డి నగదు బదిలీ చేశాడు. నగదు బైక్ డిక్కీలో ఉందని తీసుకొస్తానని బయటికి వచ్చిన అతను అక్కడి నుంచి పరారయ్యాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్థానిక యూకే బ్యాంక్‌లో తన అకౌంట్ ఫ్రీజ్ చేయించాడు. కాగా అగంతకుడు అప్పటికే అందులో నుంచి రూ.50 వేలు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లు, ఆలయాలే టార్గెట్

- దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్
- నిందితుడిపై 24 కేసులు ఉన్నట్లు గుర్తింపు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: తాళం వేసిన ఇళ్లు, దేవాలయాలే అతడి టార్గెట్. తాళం వేసి ఉంటే చాలు కన్నం వేస్తుంటాడు. ఆలయాల్లో హుండీ పగులగొట్టి చోరీలకు పాల్పడుతుంటాడు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొనిరెడ్డివంశీ తాళం వేసిన ఇల్లు, దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14న పట్టణంలోని రైతు కాలనీ కోటమైసమ్మ దేవాలయంలో హుండీని పగుటగొట్టి నగదును ఎత్తుకెళ్లాడు. 15న ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి విఠల్‌రావు పరిస్థితిని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో హుండీని పగులగొట్టి దొంగతనానికి పాల్పడుతున్నట్లు వంశీని గుర్తించి, తమదైన శైలిలో విచారించగా.. నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై నందిగామ, కొత్తూరు, కడ్తాల్, తలకొండపల్లి, శంషాబాద్, మహేశ్వరం, షాబాద్, కల్వకుర్తి, వెల్దండ, మూసాపేట్, జడ్చర్ల పోలీస్‌స్టేషన్లలో మొత్తం 24 కేసులు నమోదు అయినట్లు సీఐ తెలిపారు. శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, క్రైం ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణాధికారి డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శరత్‌కుమార్, క్రైం టీం మోహన్, కరుణాకర్, జాకీర్, రఫీ కేసును ఛేదించడంలో కీలక పాత్రను పోషించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి ఉన్నతాధికారులతో రివార్డులను ఇప్పిస్తామని సీఐ వెల్లడించారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ



గాయపడిన పవన్

కడ్తాల్: కారు- ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పవన్, మరో ఇద్దరు యువకులతో కలిసి వ్యక్తి గత పనిమీద ద్విచక్రవాహనంపై కడ్తాల్‌కు వచ్చారు. పనులు ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామం తలకొండపల్లి వెళ్తుండగా మార్గ మధ్యలో మండల పరిధి టాక్‌రాజ్‌గూడ వద్ద గురువారం రాత్రి కారు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న పవన్ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన పవన్‌ను చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణలో ఉంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చీఫ్‌విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- రూ.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



బట్టేల్‌గుట్టను సందర్శించిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో అందరం భాగస్వాములం అవుదామన్నారు. కార్పొరేషన్‌లో సుమారు రూ.45 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. చారిత్రక బట్టేల్‌గుట్ట పార్కును(కోట బురుజు) ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు, మహిళలు, సిబ్బంది ఉన్నారు.

హాజరు కాని నేతలు

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆహ్వానించారు. ఆయనతో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రావలసి ఉంది. అనివార్య కారణాల వలన వీరిద్దరూ రాలేదు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్ఆర్ సైతం రాకపోవడంపై పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యేకు దక్కని గౌరవం

శిలా ఫలకాల్లో ఎమ్మెల్యే సబితారెడ్డిని తక్కువ చేసి అగౌరవ పరిచారిచారని బీఆర్ఎస్ కార్పొరేటర్ లిక్కి మమత ఆరోపించారు. నియోజకవర్గం ఎమ్మెల్యే పేరును ఎమ్మెల్సీల కింద ఎలా పెడతారని ప్రశ్నించారు. శంకుస్థాపనల విషయంలో స్థానిక ఎమ్మెల్యేనే ప్రారంభ సభాధ్యక్షులుగా ఉంటారని, అధికార పార్టీలో లేరని ప్రొటోకాల్ పాటించకుండా ఎలా శిలాఫలకాలు వేయిస్తారన్నారు. రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిన చారిత్రక బట్టేల్‌గుట్ట పార్కును సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభించారని తెలిపారు. ఇప్పుడు ఎమ్మెల్సీ చేత రెండోసారి ప్రారంభించడాన్ని తప్పుపట్టారు. ప్రస్తుతం శంకుస్థాపనలు చేసిన పనులు.. వాస్తవంగా అయిపోయినవేనని గుర్తు చేశారు. కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.